AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
4-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

## హైవేపై రోడ్డుప్రమాదం ఇద్దరు దుర్మరణం




2

## వలలో చిక్కుకుని యువకుడు మృతి



2

## ముప్కాల్‌లో నూతన ప్రీప్రైమరీ పాఠశాలలు



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలంలో ఈ విద్యా సంవత్సరం నుంచి నాలుగు ప్రభుత్వ పాఠశాలలను నూతన ప్రీప్రైమరీ పాఠశాలలుగా ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి ఎం. గంగారాం తెలిపారు. మండలంలోని నల్లూరు ఎంపీపీఎస్, నాగంపేట్ ఎంపీయూపీఎస్, రెంజర్ల ఎంపీపీఎస్, ముప్కాల్ ఉర్దూ మీడియం పాఠశాల ఎంపీపీఎస్‌లు ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా ఎంపికయ్యాయన్నారు. ఈ పాఠశాలల్లో నాలుగేళ్లు పూర్తి చేసిన చిన్నారులకు ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ప్రీ ప్రైమరీ విద్య అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

## బోధన్ బల్దియాలో వింత వైఖరి

### రెండు నెలలు గడుస్తున్నా సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయని వైనం

**అక్షరటుడే, బోధన్:** బోధన్ బల్దియా బల్దియా తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. పాలకవర్గం ఏర్పడి నెలలు గడిచినప్పటికీ సర్వసభ సమావేశం నిర్వహించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ప్రతి మున్సిపాలిటీలో మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లతో కలిసి ప్రతినెలా సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. వార్డుల్లోని సమస్యలను కౌన్సిలర్ల ద్వారా తెలుసుకుని, ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించేందుకు ఈ సమావేశాలు దోహదపడతాయి. కానీ బోధన్ మున్సిపాలిటీలో ఇందుకు పూర్తి విరుద్ధమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత మార్చి 31న బడ్జెట్ సమావేశం నిర్వహించిన తర్వాత, ఇప్పటివరకు (రెండు నెలలు గడుస్తున్నా) ఎలాంటి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయలేదు. దీంతో తమ వార్డుల్లో సమస్యలు పేరుకుపోతున్నాయని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

### షాడో ఛైర్మన్ పెత్తనమే కారణమా?

బోధన్‌లో 'షాడో ఛైర్మన్' వర్సెస్ కౌన్సిలర్ల మధ్య అగాధం ఏర్పడినట్లు స్పష్టంగా అర్థమవుతోందని ప్రజలు భావిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ, ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం తన బాధ్యతను విస్మరించకుండా, తక్షణమే సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణను వివరణ కోరగా.. సర్వసభ్య సమావేశం నిర్వహణ అంశాన్ని మున్సిపల్ ఛైర్మన్ తూము పద్మ దృష్టికి తీసుకెళ్లామని, ఆమె అనుమతి ఇవ్వగానే సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.



## షబ్బీర్‌అలీపై ఫిర్యాదు


**అక్షరటుడే, కామారెడ్డి:** మాజీ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కామారెడ్డిలో గ్రూప్ తగాదాలకు ఆజ్యం పోస్తున్నారని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వర్గం ఆరోపించింది. ఈ మేరకు పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిండ్ల అంజయ్య, కామారెడ్డి మున్సిపల్ మాజీ ఛైర్మన్ గడ్డం ఇందుప్రియ ఆధ్వర్యంలో గురువారం క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌ను గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వర్గం కలిసింది. షబ్బీర్ అలీ కుటుంబం కామారెడ్డిలో కాంగ్రెస్ బలోపేతం కాకుండా అడ్డుకుంటోందని, గ్రూప్ తగాదాలకు ఆజ్యం పోస్తోందని వర్గ సభ్యులు ఆరోపించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేసినప్పుడు షబ్బీర్ అలీ వర్గం పనిచేయకపోవడం వల్లే ఓటమి పాలయ్యారని పేర్కొన్నారు. 2026 మున్సిపల్ ఎన్నికల్లో 49 వార్డులకు గాను షబ్బీర్ అలీ వర్గానికి 40 టికెట్లు ఇస్తే 16 మంది గెలిచారని, చంద్రశేఖర్ రెడ్డి వర్గానికి 9 సీట్లిస్తే 3 గెలిచారని వివరించారు. మిగిలిన 6 మంది అభ్యర్థులను షబ్బీర్ అలీ సోదరుడు నయీమ్, కుమారుడు ఇలియాస్ ఓడించారని ఆరోపించారు. షబ్బీర్ అలీ సోదరుడు మహ్మద్ నయీమ్‌ను సంప్రదించకుండా కామారెడ్డికి ఎస్సై నుంచి డీఎస్పీ, తహశీల్దార్, ఎంపీడీవో స్థాయి అధికారులు బదిలీపై రాలేరని, ప్రతిదానికి మామూళ్లు సమర్పించాల్సి వస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు నిమ్మ విజయకుమార్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డమీది మహేష్, తాటి లావణ్య, మాజీ కౌన్సిలర్లు సలీం, రంగ రమేష్‌గౌడ్ సహా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూముల విలువ పెంపు

ప్రజలపై మరో భారం పడింది. భూముల ధరలను ప్రభుత్వం సవరించింది. కొత్త ధరలు శుక్రవారం నుంచి అమలులోకి రానున్నాయి. ప్రాంతాన్ని బట్టి భూముల మార్కెట్ విలువలు సవరించారు. వ్యవసాయ భూముల ధరలు గ్రామీణ ప్రాంతాల్లో ఎకరాకు రూ.రూ.1.75 లక్షల వరకు పెరగగా, జిల్లా కేంద్రాల్లో రూ. కోటి వరకు పెరిగింది.

\- అక్షరటుడే, ఎల్లారెడ్డి

**రిజిస్ట్రేషన్ ఛార్జీ లెక్క:**
- ఎకరా రూ. 2.75 లక్షల భూమి అయితే
- స్టాంప్ డ్యూటీ 5శాతం = రూ. 13,750
- రిజిస్ట్రేషన్ ఫీజు 1శాతం = రూ. 2,750
- మొత్తం రూ. 16,500 అదనం పడుతుంది



- రేపటి నుంచి అమలులోకి..
- గ్రామాల్లో ఎకరం రూ. 2.75 లక్షలు
- నాలుగేళ్ల తర్వాత సవరణ
- రిజిస్ట్రేషన్ల శాఖకు పెరగనున్న ఆదాయం

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మూడో సారి రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువల పెంపునకు సర్వం సిద్ధమైంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 2021, 2022లో రెండుసార్లు రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలు పెరిగాయి. 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేయాలని యోచించింది. దీంతో ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం చేయించింది. మార్కెట్ ధరలు పెంపునకు రెండు సార్లు కసరత్తు చేసినప్పటికీ వివిధ కారణాలతో వాటిని అమలులోకి తీసుకు రాలేకపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు మూడోసారి మార్కెట్ విలువల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు, ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యన్ సూచనలను తీసుకున్నారు.

### కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి టౌన్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ పరిధిలో అగ్రికల్చర్ ల్యాండ్ ఎకరా రూ. 12 లక్షల నుంచి రూ. 18 లక్షలు వరకు, డీటీపీసీ, ఎల్ఆర్ఎస్ ప్లాట్లు గజం ధరను రూ. 4,500 నుంచి రూ. 8,000 వరకు నిర్ణయించారు. బాన్సువాడలో ఎకరా రూ.10 లక్షల నుంచి రూ. 15 లక్షలు. ప్లాట్లు గజానికి రూ. 3,500 రూ. 6,000గా సవరించారు. మద్నూర్, బిచ్కుందలో ఎకరాకు రూ. 8 లక్షల నుంచి రూ. 12 లక్షలు, ప్లాట్లు గజానికి రూ. 2,500 నుంచి రూ. 4,500 వరకు ఉండనుంది. ఎల్లారెడ్డి ఎస్ఆర్వో పరిధిలో వ్యవసాయ భూమి సాదా మెట్ట/జిరాయితీ ఎకరా రూ. 2.75 లక్షల నుంచి రూ. 4.50 లక్షలు. మాగాణి/సాగు నీటి భూమి ఎకరా రూ. 6 లక్షల నుంచి రూ. 9 లక్షలు. హైవే/మెయిన్ రోడ్ టచ్ భూమి ఎకరా రూ. 12 లక్షల నుంచి రూ. 18 లక్షలుగా మార్కెట్ విలువ సవరించారు. ఎల్లారెడ్డి టౌన్ పరిధిలో ప్లాట్లు గజానికి రూ. 3,500 నుంచి రూ. 6,500, ఎన్‌హెచ్-44 హైవే పక్కన రూ.5,000 -రూ. 9,000, గ్రామ శివారు/లేఔట్లలో రూ. 2,300 -రూ. 4,200గా నిర్ణయించారు.

### నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో వ్యవసాయ భూములు ఎకరాకు రూ. 15 లక్షల నుంచి రూ. 22 లక్షలుగా నిర్ణయించారు. ప్లాట్లు గజం రూ. 6,000 రూ. 12వేలుగా సవరించారు. ఆర్మూర్‌లో ఎకరాకు రూ. 11 లక్షల నుంచి రూ. 16 లక్షలు, ప్లాట్లు చ.గజం రూ.4,000 రూ. 7,000గా నిర్ణయించారు. బోధన్‌లో ఎకరా భూమి మార్కెట్ విలువను రూ. 10 లక్షల -రూ. 14 లక్షలుగా, ప్లాట్లు గజానికి రూ. 3,000 రూ. 5,500గా సవరించారు. ఈ రేట్లు రేపటి నుంచి అమలులోకి రానున్నాయి.

### యూనిట్‌గా తీసుకొని..

రాష్ట్రంలో దాదాపు నాలుగేళ్ల తర్వాత భూముల మార్కెట్ విలువలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ సవరించింది. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ గ్రామాలను, గ్రామ పంచాయతీలను పట్టణ ప్రాంతాల్లో, వార్డులను, డివిజన్లను యూనిట్‌గా తీసుకొని రేట్లను సవరించారు. వాణిజ్య ప్రాంతాలు, జాతీయ, రాష్ట్ర రహదారులు ఇలా వివిధ రకాలుగా యూనిట్లను తీసుకుని ఈ మార్కెట్ విలువలను సగటున పెంచినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రాల్లో వ్యవసాయ భూమి ఎకరాకు రూ. కోటి వరకు పెంచారు. నాలుగు స్లాబుల్లో పెంచిన ధరలను 15 శాతం, 25 శాతం, 50 శాతం, 75 శాతం, 100 శాతంగా విభజించారు. ఎక్కువగా 15 నుంచి 75 శాతం పరిధిలో పెంపు వర్తింపజేశారు.

## పీసీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ రెడ్డికి షోకాజ్

**అక్షరటుడే, కామారెడ్డి :** పీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి గురువారం కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు కమిటీ ఛైర్మన్ మల్లు రవి, వైస్ ఛైర్మన్ శ్యామ్ మోహన్ అనంతుల నోటీసులు అందజేశారు. కామారెడ్డి జిల్లా ప్రజా ప్రతినిధుల నుంచి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదులు అందాయని, బహిరంగ సభల్లో పార్టీ వ్యతిరేక ప్రకటనలు చేశారని పత్రికల్లో వార్తలు వచ్చాయని నోటీసులో పేర్కొన్నారు. అంతేకాకుండా పలు క్రిమినల్ కేసుల్లో చంద్రశేఖర్ రెడ్డికి ప్రమేయం ఉందనే ఆరోపణలు ఉన్నాయని, ఒక సీనియర్ నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసి ఆయన ప్రతిష్టకు, పార్టీ ఇమేజ్‌కు నష్టం కలిగించారని కమిటీ తెలిపింది. ఈ ఆరోపణలపై 7 రోజుల్లో అంటే 11 జూన్ లోపు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని నోటీసులో స్పష్టం చేశారు.



## పెట్రోలింగ్ మరింత పటిష్టం చేయాలి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్, ఎఫెక్టివ్ పెట్రోలింగ్ మరింత పటిష్టంగా నిర్వహించాలని నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్ ఆదేశించారు. ప్రజల్లో భద్రతా భావన పెంపొందించే విధంగా గ్రామాలు, ప్రధాన కూడళ్లు, జన సంచారం ఎక్కువ ఉండే ప్రాంతాల్లో పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మోపాల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఏసీపీ పరిశీలించారు. ఠాణాలోని రికార్డులు, కేసు ఫైల్స్, వివిధ రిజిస్టర్లు, పరిపాలనా వ్యవహారాలను పరిశీలించి ఎస్సై సుస్మితకు పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.




## భారీ వర్షం.. రోడ్లు జలమయం

**అక్షరటుడే, కామారెడ్డి/పోతంగల్:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలుచోట్ల గురువారం భారీ వర్షం కురిసింది. కామారెడ్డి పట్టణంతో పాటు దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, పోతంగల్ తదితర ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వాన పడింది. దీంతో కామారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ వర్షపు నీటితో చెరువులను తలపించాయి. ప్రధానంగా నిజాంసాగర్ చౌరస్తా, లయోలా స్కూల్ చౌరస్తా, పాత బస్టాండ్, సిరిసిల్ల రోడ్, విద్యానగర్ కాలనీ, బతుకమ్మ కుంట, పంచముఖి హనుమాన్ కాలనీ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం ఉండడంతో రైతులు ఆగమయ్యారు. ధాన్యం కాపాడుకోవడానికి శతవిధాలా ప్రయత్నించారు.





వర్షానికి తడిసిన ధాన్యం



పోతంగల్‌లో..

## భావితరాలకు నష్టం వాటిల్లకుండా బాధ్యతగా వ్యవహరించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** భావి తరాలకు నష్టం జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. సమాజం కోసం బాధ్యతతో మెలగాలని సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో గురువారం గ్రామ, వార్డు సభలకు శ్రీకారం చుట్టారు. మోపాల్ మండలం న్యాల్‌కల్‌లో సర్పంచ్ చంద్రకళ అధ్యక్షతన జరిగిన గ్రామసభకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీసాయి చైతన్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సంబంధిత శాఖల అధికారులు ప్రతి ఒక్కరికి తెలియజేసేలా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. అలాగే ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియకు సహకరించడం, పంటల మార్పిడి, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించాల్సిన ఆవశ్యకత, సైబర్ నేరాలపై గ్రామస్థులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచనలు చేసినందున, తదనుగుణంగా అనుకూలమైన పంటలను ఎంచుకోవాలన్నారు. పంట మార్పిడి విధానాలను అవలంభించాలని, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటిస్తూ నాణ్యమైన ఎరువులు, విత్తనాలను వినియోగించాలని సూచించారు. ఎక్కడైనా నాసిరకం, నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారదర్శకమైన ఓటరు జాబితా కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియకు సహకరించాలని కోరారు. సీపీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. గ్రామ సభలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాములు నాయక్, తహశీల్దార్ రేఖ, మండల వ్యవసాయ అధికారి జాదవ్ హీరా, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్.. కాంగ్రెస్ పార్టీ..

**అక్షరటుడే, కామారెడ్డి:** కాంగ్రెస్ పార్టీ కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. కామారెడ్డి పట్టణంలోని వెలమ ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన కామారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, 'సర్' పై విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి కనిపిస్తే టీవీలు కట్టేస్తున్నారని, ఆయన ముఖం చూడటానికి ప్రజలు ఇష్టపడడం లేదని వ్యాఖ్యానించారు. ప్రజల దృష్టిలో అబద్ధాల కోరుగా, దుర్మార్గుడిగా, చేతకాని సీఎంగా, మోసకారిగా సీఎం మిగిలిపోయాడని మండిపడ్డారు. పదేళ్లు రాష్ట్రంలో జనరంజక పాలన సాగించిన కేసీఆర్ రైతులను కడుపులో పెట్టుకుని చూసుకున్నారని గుర్తుచేశారు. ధాన్యం కొనుగోలు కేసీఆర్ ఉన్నప్పుడు ఎలా ఉండేది, ఇప్పుడెలా ఉందో ప్రజలు గమనించాలన్నారు. కేసీఆర్ హయాంలో యూరియా సరఫరా ఎలా ఉండేది, ఇప్పుడెలా ఉందో ఆలోచించాలని కోరారు. రైతులంటే రేవంత్ రెడ్డికి అంత చులకనా అని ప్రశ్నించారు. గతంలో 24 గంటలు వచ్చిన కరెంట్ ఇప్పుడు 11 గంటలే వస్తోందని, తెలంగాణలో మళ్లీ మోటార్లు కాలిపోవడం మొదలైందన్నారు. రాష్ట్రంపై సీఎం, మంత్రులు గద్దల్లా పడుతున్నారని, వేలకోట్ల భూములు దోచుకుని తింటున్నారని ఆరోపించారు. 14 ఎకరాల స్థలం ఫార్మా సిటీ కోసం భూములు సేకరించి పెడితే ఫోర్త్ సిటీ పేరుతో రేవంత్ రెడ్డి దోపిడీకి ప్రయత్నిస్తున్నారని అన్నారు. సివిల్ సప్లయ్‌లో కుంభకోణానికి పాల్పడ్డారని, ఎక్సైజ్ శాఖలో రూ.6 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, సభ్యత్వ నమోదు ఇంచార్జి వీజీగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ షిండే, బాజిరెడ్డి గోవర్ధన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దఫేదార్ రాజు, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ముజీబొద్దీన్ పాల్గొన్నారు.



## మోపాల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మోపాల్ పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ ప్రకాశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైల్స్, వివిధ రిజిస్టర్లు, పరిపాలనా వ్యవహారాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్, ఎఫెక్టివ్ పెట్రోలింగ్ మరింత పటిష్టంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల్లో భద్రతా భావన పెంపొందించే విధంగా గ్రామాలు, ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, ఫైల్స్, ఇతర అధికారిక పత్రాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ సక్రమంగా నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏసీపీ పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, ప్రజల భద్రత కోసం సీసీటీవీ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

## ఎల్లారెడ్డిలో ఉచిత కంటి వైద్య శిబిరం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా అందత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో మొత్తం 41 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఏడుగురికి మోతిబిందు శస్త్ర చికిత్సల నిమిత్తం బాన్సువాడ లయన్స్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. మరో 21 మందికి కంటి అద్దాలను సూచించగా, ఒకరిని మాత్రం ఉన్నత చికిత్స కోసం హైదరాబాద్‌లోని సరోజినీదేవి కంటి ఆసుపత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ బి. హరికిషన్ రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు సకాలంలో పరీక్షలు చేయించుకుని కళ్లను కాపాడుకోవాలని ఈ సందర్భంగా వైద్యులు సూచించారు.



కళ్లకు గంతలు కట్టుకుని ఒకే సారి ఐదు విన్యాసాలను అవలీలగా చేస్తూ అబ్బురపరుస్తోంది నిజామాబాద్ నగరానికి చెందిన ప్రవశ్రీ. ఈ విద్యార్థి ఒకే సమయంలో ఓవర్‌బోర్డ్ స్కేటింగ్, రుబిక్స్ క్యూబ్, హులా హూప్, తలపై దీపంతో నృత్యం చేస్తూ ఔరా అనిపిస్తోంది. కళ్లు మూసుకున్నా మనసు చురుగ్గా ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆమె నిరూపిస్తోంది.

– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



# కళ్లకు గంతలతో అద్భుత ప్రతిభ

■ ఒకేసారి ఐదు విన్యాసాలు ■ ప్రదర్శనలతో అబ్బురపరుస్తున్న నగరానికి చెందిన విద్యార్థి ప్రవశ్రీ

నగరంలోని మూడో డివిజన్‌కు చెందిన సాయి ప్రసాద్, తల్లి వైష్ణవి కూతురు అయిన ప్రవశ్రీ చిన్నప్పటి నుంచి వివిధ రకాల విన్యాసాలు చేయడంలో చురుకుగా ఉండేది. దీంతో స్పందించిన తల్లిదండ్రులు గురువు అయిన నవనీత వద్ద ఆమెకు శిక్షణ ఇప్పించారు. ఆమె సారథ్యంలో శిక్షణ పొందిన ప్రవశ్రీ ఓవర్‌బోర్డ్ స్కేటింగ్, హులా హూప్, తలపై దీపంతో నృత్యం, 2x2 రూబిక్స్ క్యూబ్ పరిష్కారం వంటి ఐదు విన్యాసాలను ఒకేసారి చేసి తన అసాధారణ ఏకాగ్రత, సమతుల్యతను ప్రదర్శిస్తోంది.

### సమ్మర్‌క్యాంప్‌లో ఐదు విన్యాసాలు ఒకేసారి..

వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల సమ్మర్ క్యాంప్ నిర్వహించగా బాలిక ప్రవశ్రీ తన అద్భుతమైన 'గాంధారి విద్య'ను ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యపర్చింది. ఆమె ప్రతిభకు ముగ్ధులైన అతిథులు ప్రత్యేకంగా బాలికను సన్మానించారు. గురువు నవనీత గారి శిక్షణలో రాణిస్తున్న ప్రవశ్రీ తల్లిదండ్రులు సాయి ప్రసాద్, కె.వైష్ణవి ప్రోత్సాహంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. పట్టుదల, సాధన ఉంటే అసాధ్యమేదీ లేదని ప్రవశ్రీ నిరూపిస్తోంది. కళ్లకు గంతలు కట్టుకొని ఐదు విన్యాసాలు ఒకేసారి చేయడంలో ప్రవశ్రీ ప్రతిభను చూసిన పలువురు అమెను అభినందిస్తున్నారు.

ఇండియాలోనే కాకుండా ఆస్ట్రేలియా, దుబాయ్, ఇటలీ వంటి దేశాల్లోనూ ప్రవశ్రీ ప్రదర్శనలు ఇచ్చింది. తనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తే కొత్త రికార్డులు సైతం క్రియేట్ చేస్తానని ప్రవశ్రీ చెబుతోంది.

## క్లినిక్‌లను సీజ్ చేసిన డీఎంహెచ్‌వో



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌లపై వైద్యశాఖాధికారులు కొరడ ఝులిపించారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ రోడ్‌లోని బృందావని థియేటర్ ఎదురుగా ఉన్న భారతి, ప్రియాంక క్లినిక్‌లను స్వయంగా డీఎంహెచ్‌శో రాజశ్రీ సీజ్ చేశారు. అనుమతులు లేకుండా నడుస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె స్పందించారు. ముందుగా ఆయన క్లినిక్‌లలో తనిఖీలు నిర్వహించిన ఆమె సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్, సాయన్న, జిల్లా అధికారులు చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సంతోష్ రెడ్డికి పరామర్శ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మాజీ మంత్రి సంతోష్‌రెడ్డి సతీమణి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల హైదరాబాద్‌లోని సంతోష్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ధైర్యంగా ఉండాలన్నారు.

## వరి కొయ్యలను కాల్చవద్దు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పంట కోతల అనంతరం పొలాల్లో వరి కొయ్యలను కాల్చవద్దని ఎల్లారెడ్డి మండల వ్యవసాయ అధికారిణి శోభ రైతులకు సూచించారు. కొయ్యలను కాల్చడం వల్ల కలిగే నష్టాలను ఆమె వివరించారు. నేలలోని నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలతో పాటు పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయని, కాల్చడం వెలువడే పొగతో గాలి కాలుష్యం పెరిగి, ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయన్నారు.ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఆస్తి నష్టం జరిగే ముప్పు ఉందని వివరించారు. కొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని లేదా హ్యాపీ సీడర్, స్ట్రా రీపర్ యంత్రాలను ఉపయోగించాలని కోరారు. కొయ్యలను పశుగ్రాసంగా, బయో ఎనర్జీ ప్లాంట్లకు సరఫరా చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని, ప్రభుత్వం వీటిపై సబ్సిడీ యంత్రాలను అందిస్తోందని తెలిపారు. రైతులు స్వచ్ఛందంగా వరి కొయ్యలను కాల్చడం మానుకోవాలని శోభ విజ్ఞప్తి చేశారు.

## జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం.. ఇద్దరు మృతి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. డిచ్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. అయితే అదే సమయంలో వెనక నుంచి వేగంగా వస్తున్న ఓ గుర్తు తెలియని వాహనం వారి పైనుంచి వెళ్లడంతో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న డిచ్‌పల్లి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు


**అక్షరటుడే, ఆర్మూర్:** డ్రంకన్ డ్రైవ్ కేసులో న్యాయస్థానం ఓ వ్యక్తికి జైలుశిక్ష విధించింది. ఈ మేరకు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా.. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఆరుగురు పట్టుబడ్డారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా.. ఐదుగురికి రూ.10వేల చొప్పున జరిమానా విధించగా.. ఒకరికి నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ



**అక్షరటుడే, భీమ్‌గల్ :** వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ముందస్తుగా పారిశుధ్య చర్యలు చేపట్టాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని బాబా నగర్, బాబాపూర్, బెజ్జోరా, సంతోష్ నగర్ తండా, కొత్త తండా, బాచన్‌పల్లి గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఏడు అంశాలపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. బాచన్‌పల్లిలో ఎంపీడీవో మాట్లాడుతూ.. వర్షాకాల సన్నద్ధతలో భాగంగా గ్రామ పంచాయతీల పరిధిలో పిచ్చిమొక్కల తొలగింపు, మురుగు కాలువల పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్, యాంటీ లార్వా ద్రావణాన్ని క్రమం తప్పకుండా పిచికారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్లకే అందించాలని, వీధులు, కాల్వల్లో వేయవద్దని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరికీ సురక్షిత తాగునీరు అందించేలా పంచాయతీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

## చేపల వలలో చిక్కుకొని యువకుడి మృతి



**అక్షరటుడే, కామారెడ్డి :** చెరువులో చేపలు పట్టడానికి వలతో వెళ్లిన యువకుడు అదే వలలో చిక్కుకొని ఊపిరాడక మృతి చెందాడు. ఈ ఘటన కామారెడ్డి పెద్ద చెరువులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని సరంపల్లి గ్రామానికి చెందిన బోడదారి స్వామి(25) బుధవారం సాయంత్రం కామారెడ్డి పెద్ద చెరువు లో చేపలు పట్టడానికి వల తీసుకుని బయలుదేరాడు. చేపల కోసం వల వేసిన స్వామి ప్రమాదవశాత్తు అదే వలలో చిక్కుకున్నాడు. అందులోంచి బయటకు రాలేక ఊపిరాడక మృతి చెందాడు. స్వామి మృతదేహాన్ని గురువారం ఉదయం గుర్తించగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కాగా స్వామి తల్లి పదేళ్ల క్రితం చనిపోగా తండ్రి మిషన్ భగీరథలో పని చేస్తున్నాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆ తండ్రి రోదన అందరిని కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి



**భీమ్ గల్, అక్షరటుడే:** గత వానకాలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న భీమ్‌గల్ – బడాభీమ్‌గల్ ఆర్‌అండ్‌బీ రోడ్డు, వంతెన మరమ్మతులు పూర్తికాకపోవడంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న వర్షాకాలం లోపు రోడ్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గురువారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యోగేశ్వర నర్సయ్య, పట్టణాధ్యక్షుడు కనికరం మధు మాట్లాడుతూ.. గతేడాది వర్షాలకు రోడ్డు పూర్తిగా కొట్టుకుపోతే, నామమాత్రపు మరమ్మతులతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. రోడ్డుపై గుంతలు పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల, పట్టణ అధ్యక్షుడు తోట గంగాధర్, నీలం గంగాధర్, మండల ఉపాధ్యక్షులు ఈర్ల మహేందర్, పార్థసారథి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి చిట్టి గౌడ్, తక్కూరి అంజయ్య, కొట్టాల మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నవీన్, బీజేవైఎం నాయకులు కొట్టాల అశోక్, మండల కార్యదర్శి రజినీకాంత్, సీనియర్ నాయకులు కాట్లే లింగం, ప్రశాంత్, హరిప్రసాద్, ఉప్పల నవీన్, యోగిని శ్రీనివాస్, పుండరీకం, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనుమతులు లేని 'రెసోనెన్స్ అకాడమీ'ని నమ్మి మోసపోవద్దు



**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** జిల్లాలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న 'రెసోనెన్స్ ఐఐటీ ఫౌండేషన్, నీట్ అకాడమీని నమ్మి విద్యార్థులు, తల్లిదండ్రులు మోసపోవద్దని జిల్లా విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ సంస్థపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకొని సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అధికారికి వినతిపత్రం సమర్పించారు. నగరంలోని వంశీ ఇంటర్నేషనల్ హోటల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సెంటర్ పేరుతో ఈ అకాడమీని ఏర్పాటు కోసం ప్రారంభ కార్యక్రమం ఏర్పాట్లు చేశారన్నారు. ఎలాంటి అనుమతులు లేని ఈ సంస్థ ప్రచారానికి మాజీ ఐపీఎస్ అధికారి నారాయణ ముఖ్య అతిథిగా రావడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. సమాజంలో ఆదర్శంగా ఉండే ప్రముఖులు సంస్థల అనుమతుల గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని.. ఇలాంటి సంస్థల వల్ల భవిష్యత్తులో విద్యార్థులకు భద్రతా పరమైన సమస్యలు వస్తే బాధ్యులెవరో తెలియక తల్లిదండ్రులు నష్టపోతారని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ తక్షణమే స్పందించి ఈ అకాడమీని సీజ్ చేయకపోతే, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీఎస్‌పి నాయకులు కిరణ్, టి ఎస్ ఎఫ్ నాయకుడు మహేష్, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు నవత ప్రతాప్, టీఎన్‌ఎస్‌ఎఫ్ నుంచి యూసఫ్, టీ ఎస్ ఏ జ్వాల, బీసీ వీఎస్ నుంచి శ్రీను తదితరులు పాల్గొన్నారు.